క్లుప్తంగా

గంజాయి సాగు చేస్తే చర్యలు



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి: పొలాల్లో, ఇంటి పెరట్లో గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై గంపుల విజయ్ అన్నారు. శనివారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి యువత విలాసానికి అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవదని సూచించారు. అందరూ కలిసి బాల్య వివాహాలను అరికట్టాలని పేర్కొన్నారు.

బీజేపీ 'గావ్ చలో అభియాన్'



మాట్లాడుతున్న మధుకర్

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు జనుగరి మధుకర్ ఆధ్వర్యంలో శనివారం 'గావ్ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతీ గడపకు చేరేలా క్షేత్రస్థాయిలో ప్రతీ కార్యకర్త పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గావ్ చలో కార్యక్రమం కన్వీనర్ ఘనపురం నగేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన సీఐ అంజయ్యకు సన్మానం

జైనూర్: సర్కిల్ కార్యాలయంలో నూతన సీఐ అంజయ్యను శనివారం అంబేద్కర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కాంబ్లే ఆధ్వర్యంలో దళిత సంఘం నాయకులు సన్మానించారు. కాంబ్లే మాట్లాడుతూ జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లో శాంతి భద్రతలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలన్నారు. యువజన సంఘం మండల అధ్యక్షుడు సిద్దార్థ్, ఘట్నాకర్ తదితరులు ఉన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

బెజ్జూర్: మండలంలోని పెద్ద సిద్దాపూర్ గ్రామంలో శనివారం కుష్ఠు వ్యాధిపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రతీ ఒక్కరు అవగాహన కల్పించాలని తెలిపారు. మచ్చలు ఉన్నవారు వైద్య పరీక్షలు చేసుకోవాలని, 12 నెలల కాలం చికిత్స అందితే నయమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పర్వీన్ సుల్తానా, కార్యదర్శి వైకుతం, సిబ్బంది సుస్మిత, మేఘన, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నం.4 గ్రామానికి చెందిన జైదేవ్ సర్దార్ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి శనివారం ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ బాధితుడికి అప్పగించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. సెల్‌ఫోన్ ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీంను అభినందించారు.

'ఎస్‌ఎంసీ'కి సన్మానం

రెబ్బెన: మండలంలోని రేకులగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మహేష్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీ సహకారంతో పాఠశాల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పదవీకాలం పూర్తి చేసుకున్న ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తక్కళ్లపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మహేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.


'పాల్వాయి'ని సన్మానించిన వైద్యులు



సన్మానిస్తున్న సభ్యులు

కౌటాల: కరీంనగర్ పట్టణంలో నిర్వహించిన తెలంగాణ ఎముకల వైద్యుల వార్షిక సదస్సులో శుక్రవారం రాత్రి ఎముకల వైద్యుల అసోసియేషన్ సభ్యులు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తాను ఆర్థోపెడిక్ వైద్యుడిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించి, ప్రజలకు సేవ చేయాలనే తపనతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు.

అక్షరం దిద్దని ఆదివాసీ బిడ్డలు!



మూతపడిన సోయంగూడ పాఠశాల

- విద్యకు దూరంగా 30మంది బడీడు పిల్లలు
- నాలుగేళ్లుగా తెరుచుకోని సోయంగూడ పాఠశాల
- విద్యాబోధన ప్రారంభించాలని తల్లిదండ్రుల వేడుకోలు

వాంకిడి: 'ఆదివాసీల అభివృద్ధి విద్యతోనే సాధ్యం' అంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు గిరి గ్రామాల్లో జరిగే సమావేశాలు, అవగాహన కార్యక్రమాల్లో నిత్యం చెబుతుంటారు. కానీ గ్రామాల్లో పాఠశాలలు ఉన్నాయా.. విద్యాబోధన జరుగుతుందా.. ? అన్న అంశాలపై మాత్రం వారు దృష్టి సారించడం లేదు. దీంతో కొన్ని గ్రామాల్లో ఆదివాసీ బిడ్డలు అక్షర జ్ఞానానికి దూరమవుతున్నారు. గ్రామాల్లో బడీడు పిల్లలు ఉన్నా విద్యార్థుల సంఖ్య సున్నాగా చూపిస్తూ పాఠశాలలను మూసి వేస్తున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. సుమారు 30 మంది బడీడు పిల్లలు ఉన్న సోయంగూడ గ్రామంలో పాఠశాల మూత పడి నాలుగేళ్లు కావస్తున్నా విద్యాశాఖ అధికారులు పాఠశాల పునఃప్రారంభంపై దృష్టి సారించడం లేదు. గ్రామంలోని పిల్లలు తల్లిదండ్రులతో కలిసి పంట పొలాల్లో పనులు చేస్తూ, వీధుల్లో తిరుగుతూ విద్యకు దూరమవుతున్నారు.



గ్రామంలోని పిల్లలు

మూత'బడి' నాలుగేళ్లు..

ఉపాధ్యాయుల కొరత కారణంగా నాలుగేళ్ల క్రితం విద్యా వలంటీర్లతోనే సగం పాఠశాలలు కొనసాగుతుండేవి. మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామాల్లోని పాఠశాలలను విద్యా వలంటీర్లే నిర్వహించేవారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వలంటీర్లను తొలగించడంతో ఆయా పాఠశాలలకు రెగ్యులర్ ఉపాధ్యాయులను కేటాయించాల్సి వచ్చింది. కానీ ఉపాధ్యాయుల కొరత ఉండటంతో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సున్నాగా చూపించి పాఠశాలలను మూసివేశారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. సోయంగూడ పాఠశాలను సైతం పిల్లలు లేరని నాలుగేళ్ల క్రితం మూసివేశారు. దీంతో గ్రామంలోని పిల్లలు విద్యకు దూరం కావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

30 మంది పిల్లలు..

మండలంలోని సోయంగూడ గ్రామంలో 34 కుటుంబాలు ఉండగా అక్షరమెరుగని బడీడు పిల్లలు సుమారు 30 మంది ఉన్నారు. బడికి ఉపాధ్యాయుడిని కేటాయించకపోవడంతో పిల్లలు విద్యకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం కూడా లేదని, నాలుగు కిలోమీటర్ల దూరంలోని కోపగూడ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రతీరోజు చిన్నారులను తీసుకెళ్లలేని పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాల పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి



గ్రామంలోని పాఠశాలను మూసివేసి నాలుగేళ్లు గడిచిపోయాయి. బడికి ఉపాధ్యాయుడిని కేటాయించి పునఃప్రారంభించేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామంలో 5 ఏళ్లు నిండిన బడీడు పిల్లలు 30 మంది వరకు ఉన్నారు.

– సోయం మోతీరాం, గ్రామ పటేల్, సోయంగూడ

పిల్లలకు అక్షరాలు తెలియదు



నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. అందులో ఇద్దరికి ఐదేళ్లు దాటాయి. కానీ ఇప్పటి వరకు అక్షరం ముక్క నేర్చుకోలేదు. విద్యపై అవగాహన లేక మా జీవితాల్లో అభివృద్ధి సాధ్యపడలేదు. మా పిల్లలకు అయినా విద్యనందించేలా చర్యలు తీసుకోవాలి.

– సోయం జంగుబాయి, సోయంగూడ

పాఠశాలను తెరిపించాలి



గ్రామంలో సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ప్రతీసారి అధికారులు, ప్రజాప్రతినిధులు విద్య ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. కానీ గ్రామంలో మూతబడి ఉన్న పాఠశాలపై దృష్టి సారించడం లేదు. పాఠశాలను తెరిపించేలా చర్యలు తీసుకోవాలి.

–సోయం జగన్, సోయంగూడ

బహిరంగ సభకు తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

వాంకిడి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టనున్న సమ్మెలో భాగంగా 11వ తేదీన కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే బహిరంగ సభకు కార్మికులు భారీగా తరలిరావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో హమాలీ కార్మికులతో కలిసి సభా పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తయినా రైతాంగ, కార్మికవర్గ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. సభకు సీఐటీయూ ఆల్ ఇండియా కోశాధికారి సాయి బాబు, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, నాయకులు మధు, జయలక్ష్మి రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు రాకేశ్, ధర్మేందర్, సోమయ్య, ధర్మ, మధు, నానాజీ, సంతోష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపాలి

కౌటాల: బడీడు పి ల్లలను బడికి పంపాలని ముత్తంపే ట్ జెడ్పీ ఉన్నత పా ఠశాల హెచ్‌ఎంగా వుడే హన్మంతు అ న్నారు. శనివారం మండలంలోని శీర్షా గ్రామంలో బడి బయట పిల్లలతో మాట్లాడారు. ఆయన మాట్లాడు తూ చదువుతోనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని పేర్కొన్నారు. పిల్లలను పనికి తీసుకెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట సీఆర్పీలు ప్రకాశ్ ఉన్నారు.

నేడు దేవీ వార్షికోత్సవం

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ స మీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీ శివ సిద్ధి హనుమాన్ ఆలయం ఆవరణలోని శ్రీ విఠల్ రుక్మిణి దేవి ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు. నేడు ఉదయం 7 గంటలకు ఆలయంలో భక్తిశ్రద్ధలతో అభిషేకం, నవగ్రహ పూజ, హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

రెబ్బెన: మండలంలోని దేవులగూడ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్ శనివారం డిమాండ్ చేశారు. జాతీయ రహదారి పక్కన ఉన్న గంగాపూర్ శివారులోని 342 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకుడు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని దీనిపై తహసీల్దార్ సమీర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారి నిర్మాణం పూర్తి కావటంతో విలువైన ప్రభుత్వ భూమి కబ్జా చేసేందుకు సదరు నాయకుడు నిర్మాణ పనులు సైతం చేపట్టాడన్నారు. గుంటకు రూ. 10లక్షల విలువ చేసే విలువైన ప్రభుత్వ భూమిని బీఆర్‌ఎస్ నాయకుడు కబ్జా చేయకుండా రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, మాజీ సర్పంచ్ గంటుమేరలు పాల్గొన్నారు.



పనులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో గ్రామపంచాయతీల స్పెషల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలతో పాటు మంచినీటి సమస్య ఎదురుకాకుండా చూడాలన్నారు. గ్రామీణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారులు తహసీల్దార్ కిరణ్, డీఈవో శ్రీనివాస్, పీఆర్ ఏఈ రాజ్‌కుమార్, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈఈ సిద్దిక్, డిప్యూటీ తహసీల్దార్ రఘునాథ్, సీడీపీవో సురేఖ, ఎంఎస్‌వో దేవాజీ, హార్టికల్చర్ శాంతిప్రియ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

పెంచికల్‌పేట్ ఎంపీడీవోగా రమేశ్

పెంచికల్‌పేట్: మండల ఎంపీడీవోగా డి.రమేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి జిల్లా మంథని నుంచి బదిలీపై రాగా ఇన్‌చార్జి ఎంపీడీవో గంగాసింగ్ బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా తన వంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

ప్రత్యేక అధికారుల సమావేశం

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో రమేశ్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన నేపథ్యంలో పలు సూచనలు చేశారు. ప్రత్యేక అధికారులు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీవో గంగాసింగ్, ఎంఈవో రమేశ్‌బాబు, ఏఈ మనోహర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో రమేశ్

జంగుబాయి దర్శనానికి బయలుదేరిన భక్తులు

జైనూర్: ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి పుణ్య క్షేత్రాన్ని దర్శించుకునేందుకు మండలంలోని ఉశేగాం గ్రామస్తులు శనివారం కాలినడక ద్వారా పయనమయ్యారు. పుష్య మాసాన్ని పురస్కరించుకొని ఆదివాసులు జంగుబాయి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోనున్నారు. తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో ఉన్న జంగుబాయిని దర్శనానికి ఎంతో మంది భక్తులు కాలినడకన వెళ్తుంటారని ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు పేర్కొన్నారు.



బయలు దేరిన ఉశేగాం గ్రామస్తులు

నేడు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని పద్మశాలి భవన్‌లో ఆదివారం కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ, విద్యావికాస నైపుణ్యంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రముఖ సైకాలజిస్టు, కెరియర్ కౌన్సిలర్, మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సంద్ర విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. శిక్షణ కార్యక్రమంలో 7వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

'రోడ్డు భద్రత'పై అవగాహన

'వాహనదారులు ఒక్క క్షణం ఆలోచించండి.. రహదారి భద్రత నియమాలు పాటించండి.. ప్రాణం తీసే అతివేగాన్ని వదలండి.. ప్రమాదాల బారిన పడి కుటుంబాలకు దూరం కాకండి.. మిమ్మల్ని నమ్ముకున్న వారికి కన్నీటిని మిగల్చకండి' అంటూ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వాహనదారులకు పూలు ఇచ్చి మరీ రహదారి భద్రత ఆవశ్యకతను వివరిస్తున్నారు.

- అతివేగం, మద్యం తాగి నడపడం ప్రమాదాలకు కారణాలు
- ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే మేలు
- కొనసాగుతున్న జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు

కౌటాల: గతేడాది జూలైలో మండలంలోని వైగాం గ్రామం వద్ద ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడగా బెజ్జూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు బుర్రి వసంత్ (26), అనిల్(24) అక్కడిక్కడే మృతి చెందారు. డ్రైవర్ చిలుకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గతేడాది జూలైలో కాగజ్‌నగర్ –పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి చెందారు. హెల్మెట్ ధరించి ఉంటే కనీసం వారి ప్రాణాలైన దక్కేవి. ఇలాంటి ఘటనలు జిల్లాలో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అతివేగం, మద్యం తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, రహదారి భద్రత నియమాలు పాటించకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఏటా జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా గత నెల 15న ప్రారంభమైన 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగనున్నాయి.



బెజ్జూర్ ప్రధాన రహదారిపై ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఎస్సై మధుకర్

అవగాహన కార్యక్రమాలు

37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పలు చోట్ల ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సై మధుకర్ హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. బోదంపల్లి గ్రామంలో కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారిపై ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే ప్రాణాలకే ముప్పు అని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌తో ప్రమాదాలు..

మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల్లో మృతి చెందే వారిలో ఎక్కువ సంఖ్యలో యువకులే ఉండడం కలిచివేసే అంశం. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను పెద్ద చేసి, వృద్ధాప్యంలో తోడునీడగా ఉంటారనుకుంటే రోడ్డు ప్రమాదాల్లో తనువు చాలించడం వారిని దిక్కులేని వారిగా చేస్తోంది. ప్రమాదాల్లో కుటుంబ పెద్దను కోల్పోవడం వల్ల కుటుంబాలు వీధిన పడుతున్నాయి. కౌటాల మండలంలో గతేడాది 12 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందగా.. 8 మందికి గాయాలయ్యాయి.

వాహనదారులు చేయకూడనివి..

- వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దు.
- వేగంగా వాహనాలు నడపొద్దు.
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదు.
- మద్యం సేవించి వాహనం నడపకూడదు.
- మైనర్లు వాహనం నడపరాదు.

వాహనదారులు పాటించాల్సిన నియమాలు..

- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి.
- కార్లలో వెళ్లే వారు విధిగా సీటు బెల్టు ధరించాలి.
- ట్రాఫిక్ నియమాలు పాటించాలి.

అవగాహన కల్పిస్తున్నాం



రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వాహన డ్రైవర్లు, ప్రజలకు వివరిస్తున్నాం. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు విధిగా ధరించాలి. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి.

– ఎస్. మధుకర్, ఎస్సై

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్ రూరల్: నేచర్ క్యాంపు పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తుందని డీఈవో పార్సి అశోక్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో నేచర్ క్యాంపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ గ్రీన్ కోర్ జాతీయ హరితదళం ఆధ్వర్యంలో 8నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేచర్ క్యాంపు నిర్వహిస్తే వారికి పర్యావరణ స్పృహ కలిగిస్తుందన్నారు. జాతీయ హరిత దళం రీజినల్ కోఆర్డినేటర్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. నేచర్ క్యాంపు నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు, ఫారెస్ట్ అధికారులు ఎంతగానో సహకరించారని పేర్కొన్నారు. అటవీ సంపదపై అవగాహన కల్పించినట్లు, పక్షులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్‌రేంజ్ అధికారి రమాదేవి, ఇన్‌చార్జి కటకం మధుకర్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అబుదాలి, నోడల్ అధికారి దేవాజీ, ప్రధానోపాధ్యాయులు శ్రీలత, వరలక్ష్మి, అనురాధ, విజయలక్ష్మి, రమాదేవి, నీరజ, కవిత, జయలక్ష్మి, భారతి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో అశోక్

బోధన కృత్యాల ద్వారా పఠనాసక్తి

రెబ్బెన: బోధన కృత్యాల ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించవచ్చని లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి కుమార్ అన్నారు. లేతన్‌గూడ పాఠశాల విద్యార్థులకు ఇటీవల ఏర్పాటు చేసిన రీడింగ్ రూంలో విద్యార్థులతో బోధన కృత్యాలు చేయించారు. ఆయన మాట్లాడుతూ రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ అందించిన పుస్తకాల్లోని బొమ్మలు ఆకర్షణీయంగా ఉండి పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించేలా ఉన్నాయన్నారు. రూం టూ రీడ్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు సాయికృష్ణ పాల్గొన్నారు.



బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రవికుమార్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899